క్లుప్తంగా

చిరుసంచుల వరిసాగుతో అధిక దిగుబడి

సంగుపేట ఏరువాక శాస్త్రవేత్త సరిత



చిట్కుల్‌లో రైతు సుభాశ్‌రెడ్డి వరిసాగును పరిశీలిస్తున్న ఏరువాక శాస్త్రవేత్త సరిత

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతుల ఆసక్తితోనే చిరుసంచుల వరిసాగు సాధ్యమవుతుందని, ఈ సాగుతో అధిక దిగుబడి వస్తుందని సంగుపేట ఏరువాక శాస్త్రవేత్త సరిత అన్నారు. గురువారం చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ గ్రామ వాసి సుభాశ్‌రెడ్డికి అందించిన పలురకాల చిరుసంచుల వరి సాగును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతు సుభాశ్‌రెడ్డికి అందించిన జగిత్యాల–28639, వరంగల్–1537 అనే దొడ్డు రకం వరి సాగు ప్రస్తుతం బాగున్నాయన్నారు. ఈ రకం విత్తనాలు 120-125 రోజుల కాలపరిమితిలో ఎకరాకు 30–34 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. వరంగల్ రకం అగ్గితెగులు, ఎండు తెగులు తట్టుకుంటుందన్నారు. పంట కోసే వరకు పంట పొలాలను, రైతు పాటించే పద్ధతులను పర్యవేక్షిస్తూ, తగిన సలహాలు అందజేస్తామన్నారు.

మాఫీ కాని రైతుల వివరాల సేకరణ



రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా గ్రామాలలో రుణమాఫీ కాని రైతుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నట్లు ఏఈఓ తెలిపారు. గురువారం ఆయా గ్రామాలకు చెందిన రైతుల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేశారు.

కొనసాగుతున్న సర్వే

మనోహరాబాద్(తూప్రాన్): రుణమాఫీ కానీ రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి వ్యవసాయాధికారులు బుధవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి స్రవంతి మాట్లాడుతూ రుణమాఫీ కాని వారికి ఏ కారణం చేత కాలేదో తెలుసుకున్నామన్నారు. మండలంలో మాఫీ కానీ 98 మంది రైతులను గుర్తించినట్లు తెలిపారు.

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్, హవేళిఘణాపూర్ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో రుణమాఫీ పొందని వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి సర్వే నిర్వహిస్తున్నారు. మండల పరిధిలోని బూర్గుపల్లి, గాజిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన రైతుల ఇళ్ల వద్దకు వెళ్లిన ఏవో బాల్‌రెడ్డి గురువారం ఆన్‌లైన్‌లో వారి వివరాలను నమోదు చేశారు.

మొక్కలు నాటిన శాస్త్రవేత్తలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి కేవీకేలో శాస్త్రవేత్తలు అమ్మ పేరిట గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ చెట్లుంటే మానవళికి క్షేమమని చెప్పారు. మొక్కలతో పర్యావరణ సమతుల్యం ఉంటుందన్నారు. మొక్కల వల్ల వర్షాలు కురిసి వ్యవసాయ అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు రవిపాల్తియ, ఉదయ్‌కుమార్, శ్రీకాంత్, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రోగ్రాం ఫెసిలిటేటర్ నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగయ్య ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా పేరూర్, ర్యాలమడుగు, కొంటూర్, వెంకటాపూర్ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, యాదగిరి, సురేందర్, నాగరాజ్, పీర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులు ఇష్టంతో చదివితే అభివృద్ధి సాధ్యమని ఎంజేపీ తునికి ప్రిన్సిపాల్ హరిబాబు తెలిపారు. గురువారం కౌడిపల్లి మండలం తునికివద్దగల ఎంజేపీటీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో ఫ్రెషర్స్‌పార్టీని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల స్పెషల్ ఆఫీసర్ జనార్దన్, ఏటీపీ సుష్మ, డిప్యూటీ వార్డెన్ లక్ష్మణ్, సీనియర్ లెక్చరర్లు పవన్, విక్రమ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎనిమిది ఇళ్లలో చోరీ..

రామాయంపేట (మెదక్): రామాయంపేటలోని కేసీఆర్ కాలనీలో గల డబుల్ బెడ్రూం ఇళ్లలో బుధవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఎనిమిది ఇళ్ల తాళాలు ధ్వంసం చేసి సామగ్రి చిందరవందరగా పడేసి వెళ్లారు. సీఐ వెంకట్ రాజాగౌడ్, ఎస్సై బాలరాజు ఘటన స్థలాన్ని సందర్శించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శిథిలం.. భయం భయం

శిథిలావస్థలో జెడ్పీ పాఠశాల భవనం

- పూర్తిగా దెబ్బతిన్న మూడు తరగతి గదులు
- నిధులు మంజూరైన విడుదలకు నోచని వైనం
- అమ్మ ఆదర్శ పాఠశాల, పీఎంశ్రీ పథకం కింద ఎంపికైనా ప్రయోజనం శూన్యం!



పాఠశాల గోడలకు ఏర్పడిన పగుళ్లు

అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ జెడ్పీ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. అందులోనే పాఠశాల కొనసాగుతుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎటు వైపు నుంచి ఏ ప్రమాదం పొంచి ఉందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఎంపికైనా మరమ్మతులకు నోచలేదు. పీఎంశ్రీ పథకం కింద కూడా ఎంపికైంది కానీ మంజూరైన నిధులు విడుదల కాలేదని హెచ్‌ఎం పేర్కొన్నారు.

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ జెడ్పీ జిల్లా పరిషత్ పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. దశాబ్ద కాలం క్రితమే భవనం నిర్మించారు. నాణ్యత లోపంతో నిర్మించడం వల్ల ఎక్కడికక్కడే బీటలు వారాయి. పిల్లర్లు, పునాదులు సహితం కూలిపోతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పైకప్పు శ్లాబ్ ఉరుస్తుంది. తరగతి గదుల్లో నీరు చేరడంతో విద్యార్థులు , ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మూడు గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. అందులో తరగతులు నిర్వహించడం లేదు. వరండాలో బండలు పాడైపోయి అధ్వానంగా మారింది. అమ్మ అదర్శ పాఠశాల కింద ఎంపికైనా మరమ్మతులకు నిధులు మంజూరు కాలేదు. పంచాయతీ రాజ్ అధికారుల నిర్లక్ష్యంతోనే పాఠశాల మరమ్మతుకు నిధులు మంజూరు కాలేదని పాఠశాల హెచ్‌ఎం డీఈఓకు ఫిర్యాదు చేశారు. 2023–24లో కేంద్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి కోసం పీఎంశ్రీ పథకం కింద 21 జెడ్పీ పాఠశాలలను జిల్లాలో ఎంపిక చేసింది. అందులో ముస్లాపూర్ జెడ్పీ పాఠశాల ఉంది. ఇలా ఎంపికైన పాఠశాలలో మెరుగైన విద్య, సకల సౌకర్యాలు కేంద్ర ప్రభుత్వ నిధులతో కల్పిస్తారు. ఇందులో అదనపు గదుల నిర్మాణం, పాఠశాల మరమ్మతుకు నిధులు, సైన్స్ ల్యాబ్, టైలరింగ్, ఎంబ్రయిడింగ్, నర్సింగ్, కంప్యూటర్ తదితర ఒకేషనల్ కోర్సుల్లో విద్యార్థులను తీర్చిదిద్దాల్సి ఉంటుంది. ఈ పథకం కింద మరమ్మతుకు రూ.15 లక్షలు మంజూరైనా నిధులు మాత్రం విడుదల చేయలేదని ఉపాధ్యాయులు తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్న ల్యాబ్, ఒకేషనల్ కోర్సు మెటీరియల్ ఇంకా ప్రభుత్వం మంజూరు చేయలేదు. జిల్లాలో 21 పాఠశాలలు ఎంపిక కాగా 7 పాఠశాలలకు మాత్రమే మెటీరియల్ కొనుగోలు కోసం నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. పేరుకె పీఎంశ్రీ పాఠశాలగా ఎంపికైనా ఎలాంటి ప్రయోజనం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వరండాలో బండల దుస్థితి

పీఎంశ్రీ కింద సౌకర్యాలు కల్పించాలి



కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకం కింద పాఠశాలను ఎంపిక చేసింది. ఏడాది గడుస్తున్నా పనులు మాత్రం జరగడం లేదు. ఒకేషనల్ కోర్సులు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పీఎంశ్రీ పనులు వెంటనే ప్రారంభించాలి.
–రాఘవి, విద్యార్థిని, ముస్లాపూర్

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పాఠశాల సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అమ్మ ఆదర్శ పాఠశాల కింద మరమ్మతుకు నిధులు మంజూరు కాలేదు. పంచాయతీరాజ్ అధికారులు నిర్లక్ష్యమే కారణం. పీఎంశ్రీ కింద మంజూరైన నిధులు విడుదల చేస్తే పాఠశాలకు కనీసం మరమ్మతులైన చేయవచ్చు.
– రమేశ్, హెచ్‌ఎం, ముస్లాపూర్ జెడ్పీ పాఠశాల

భయంగా ఉంది



పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో భయం భయంగా ఉంది. పిల్లర్లు, గోడలు కూలిపోతున్నాయి. భారీ వర్షాలు కురిస్తే భయం వేస్తుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు.
– అజయ్, విద్యార్థి, ముస్లాపూర్ జెడ్పీ పాఠశాల

క్రీడలతో స్నేహభావం

- ఎస్‌ఐ నారాయణగౌడ్
- చిన్నశంకరంపేటలో క్రీడలు ప్రారంభం

చిన్నశంకరంపేట(మెదక్): క్రీడలు విద్యార్థులకు గెలుపు ఓటములను నేర్పుతాయని చిన్నశంకరంపేట ఎస్‌ఐ నారాయణగౌడ్ అన్నారు. గురువారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలో పాఠశాల క్రీడా పోటీలను (ఎస్‌జీఎఫ్) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడా పోటీలతో స్నేహభావం, క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తాయని చెప్పారు. ఎంపీడీఓ దామోదర్ మాట్లాడుతూ క్రీడా పోటీలలో పాల్గొనడం ద్వారా విద్యార్థులు గెలుపు ఓటములను ఫేస్ చేయడం నేర్చుకుంటారని పేర్కొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ నారాయణగౌడ్, ఎంపీడీఓ దామోదర్

కొనసాగుతున్న ఎస్‌జీఎఫ్ క్రీడలు

టేక్మాల్(మెదక్): మండల కేంద్రమైన టేక్మాల్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు గురువారం ఎస్‌జీఎఫ్ క్రీడలు గురువారం రెండోరోజు కొనసాగాయి. అండర్ 14, అండర్ 17 బాలురకు ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించారు.

నేడు ఎస్‌జీఎఫ్ క్రీడలు

పాపన్నపేట: స్థానిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ క్రీడలు నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు మహేశ్వర్ తెలిపారు. రెండు రోజుల పాటు క్రీడలు జరుగుతాయని చెప్పారు. 14 నుంచి 17 సంవత్సరాల్లోపు విద్యార్థులు క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు.

ధ్యాన్ చంద్ స్ఫూర్తితో క్రీడల్లో రాణించాలి

కొల్చారం(నర్సాపూర్): మేజర్ ధ్యాన్ చంద్ స్ఫూర్తితో విద్యార్థులు క్రీడల్లో రాణించాలని రంగంపేట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఉపేందర్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. గురువారం జాతీయ క్రీడల దినోత్సవం, ధ్యాన్ చంద్ జన్మదిన పురస్కరించుకొని పాఠశాల ఆధ్వర్యంలో మండల స్థాయి బాలుర, బాలికల విభాగంలో 2కే రన్ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ చండీప్రియ జెండా ఊపి ప్రారంభించారు. ఈ 2కే రన్ లో పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బీఆర్ఎస్ పార్టీ మండల యువత విభాగం అధ్యక్షుడు సంతోష్ రావు సౌజన్యంతో బహుమతులను ప్రదానం చేశారు. బాలుర విభాగంలో మొదటి స్థానంలో వరిగుంత ఉన్నత పాఠశాలకు చెందిన యశ్వంత్, బాలికల విభాగంలో ఇదే పాఠశాలకు చెందిన ఇందు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో మెదక్ ఆత్మ కమిటీ డైరెక్టర్ ఆంజనేయులు, కోనాపూర్ మాజీ సర్పంచ్ రమేష్, రవీందర్, దత్తు, పాఠశాల పీడీ శ్రీధర్ రెడ్డి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



2కే రన్‌ను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం, చైర్మన్ తదితరులు

కంటి పరీక్షలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినులకు ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గురువారం ఆప్తాలమిక్ ఆఫీసర్ మోహన్, ఆర్‌బీఎస్‌కే డాక్టర్ కృష్ణకుమార్ పాఠశాలలోని 5 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు కంటిపరీక్షలు నిర్వహించారు. మొత్తం 219 మందికి చికిత్సలు చేయగా 32 మందికి కంటి చూపు సమస్య ఉందన్నారు. వీరికి అద్దాలు అవసరంగా గుర్తించినట్లు చెప్పారు. త్వరలో అద్దాలు మంజూరు అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్ ఎం ఎండీ సాజిద్‌అలీ, ఉపాధ్యాయులు పీ అనీత, శివపార్వతి, మమత, డీపీ అనీత, అమూల్య, స్నేహలత, లత తదితరులు పాల్గొన్నారు.



బాలికల ఉన్నత పాఠశాలలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వెల్మకన్నలో హోమియో వైద్యశిబిరం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో హోమియోపతి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రోగులకు మందులు పంపిణీ చేశారు. గురువారం హోమియోపతి వైద్యులు ప్రేమ్‌కుమార్, డాక్టర్ హైమావతి ఆధ్వర్యంలో 96మందికి చికిత్సలు చేశారు. కీళ్లనొప్పులు, షుగర్, బీపీ, అజీర్తి, జలుబుతోపాటు సీజనల్ వ్యాధులకు సంబంధించిన చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రాజేందర్, గంగాగౌడ్, మాజీ మండల ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా, అశోక్, రవిసాగర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



వైద్యశిబిరానికి హాజరైన స్థానికులు

మాసాయిపేటలో ఉచిత వైద్య శిబిరం

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేటలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత వృద్ధాప్య వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యాధికారి శ్రీదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని తహసీల్దార్ జ్ఞానజ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా దగ్గు, దమ్ము, జ్వరం, జలుబు, రక్తపోటు, మోకాళ్ల నొప్పులు వంటి జబ్బులకు సంబంధించి డా. శ్రీదేవితో పాటు రత్నాపూర్ వైద్యులు డా.శ్రీనివాస్ సుమారు వంద మందికి చికిత్సలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జ్ఞానజ్యోతి, కోరారు. ఈ శిభిరంలో ఫార్మాసిస్ట్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ ఏకాదశి రుద్రహోమం

చేగుంట(తూప్రాన్): మండలంలోని కర్నాల్‌పల్లి గ్రామంలో ఉన్న సాయిబాబా ఆలయంలో శ్రావణ బహుళ ఏకాదశిని పురస్కరించుకొని రుద్రహోమం నిర్వహించారు. పూజల్లో భాగంగా ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు, అష్టోత్తర శత కలుషాభిషేకం, మహాసుదర్శన యాగం, రుద్ర హోమం పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. పూజల అనంతరం సాయినాథుడికి పల్లకీ సేవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ యాదిరెడ్డి పూజారి వీరేశం, నిర్వాహకులు ఆంజనేయులు, శాస్త్రుల రాజేశ్వరశర్మ, ఈశ్వరీపీఠ వ్యవస్థాపకుడు ఆయాచిత రవిచంద్ర శర్మ, రమేశ్, రాంరెడ్డి, యాదగిరి, అంజనేయులు, మహిపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి సత్యనారాయణగౌడ్‌తో పాటు పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు. మండల కేంద్రమైన చేగుంటలోని మహంకాళీ అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకలు గురువారం ప్రారంభించారు.



సాయిబాబా ఆలయంలో పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తున్న భక్తులు

పొదుపు పథకాలతో మేలు

చిన్నశంకరంపేట(మెదక్): సామాన్య ప్రజలకు మేలు చేసే పోస్టాఫీస్ పొదుపు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మెదక్ సబ్ డివిజన్ పోస్టల్ అధికారి సందీప్ కోరారు. గురువారం మండలంలోని మిర్జాపల్లి పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో పొదుపు పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోస్టల్ పొదుపు పథకంతో పాటు చిన్నారులకు లబ్ధి చేకూర్చే పొదుపు, విద్య పథకాలతో లబ్ధిపొందవచ్చన్నారు. కార్యక్రమంలో పోస్టల్ డెవలప్‌మెంట్ అధికారి హర్షవర్ధన్, విజయ్, వెంకటకృష్ణ, మిర్జాపల్లి పోస్ట్‌మాస్టర్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెదక్ సబ్ డివిజన్ అధికారి సందీప్

కిసాన్‌సెల్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి



నియామక పత్రం అందజేస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కాంగ్రెస్ కిసాన్‌సెల్ అధ్యక్షుడిగా బక్కన్నగారి శ్రీనివాస్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడి నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌గౌడ్, బాజి, రాజేష్, సుధాకర్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలి

బీజేపీ నియోజవర్గ ఇన్‌చార్జి పంజా విజయ్

చిన్నశంకరంపేట(మెదక్): స్థానిక ఎన్నికలే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేసి మెజార్టీ స్థానిక సంస్థలను బీజేపీ కై వసం చేసుకోవాలని పార్టీ మెదక్ నియోజవర్గ ఇన్‌చార్జి పంజా విజయ్ కుమార్ కోరారు. గురువారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు పోగుల రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీలను అత్యధికంగా గెలుచుకున్నప్పుడే ప్రజల సమస్యలను, గ్రామాల సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు రాగి రాములు, రాచర్ల ఆశోక్, శంకర్, మండల నాయకులు దశరథం, మంజుల, రాజు, రమేశ్, రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తప్పులు లేకుండా వివరాల సేకరణ

శివ్వంపేట(నర్సాపూర్): ఓటరు నమోదు, ఇతర అంశాలపై సమగ్రంగా వివరాలు నమోదు చేయాలని ఉప తహసీల్దార్ షఫీయొద్దీన్ అన్నారు. గురువారం బీఎల్‌ఓలతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. బీఎల్‌ఓలు ప్రతీఇంటి వద్దకు వెళ్లి ఓటరు వివరాలు తప్పులు లేకుండా చేపట్టాలన్నారు. మృతిచెందిన వారి పేర్లు తొలగించడంతో పాటు ఏమైన తప్పులు ఉంటే సరిచేయాలన్నారు. ఓటరు నమోదుకు సంబంధించి ఏఎల్‌ఎంటీలు శ్రీనివాస్, కొండల్ అవగాహన కల్పించారు.



ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్న షఫీయొద్దీన్

గ్రామ దేవతలకు పూజలు

నర్సాపూర్: వర్షాలు సమృద్ధిగా కురువాలని, పంటలు బాగా పండాలని నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని హన్మంతాపూర్ ప్రజలు గురువారం గ్రామ దేవతలకు పూజలు చేశారు. గ్రామంలోని కట్ట మైసమ్మ, గాలిపోచమ్మ, గండిమైసమ్మ దేవతలకు పూజలు చేయగా.. మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం దేవతలకు నైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.



పూజలో మున్సిపల్ చైర్మన్, గ్రామస్తులు

అదుపుతప్పి కారు బోల్తా

ముగ్గురికి గాయాలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): వేగంగా వస్తున్న కారు ప్రమాదవశాత్తు అదుపుతప్పి పల్టీ కొట్టి చెట్టును ఢీకొన్నది. ఈ సంఘటన చిలప్‌చెడ్ మండలం చిటుకుల్ గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. ఫుల్‌కల్ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మెదక్ నుంచి జోగిపేట వైపు వస్తుండగా, చిట్కుల్ శివారులో గల పెట్రోల్ బంక్ వద్ద గుంతలు పడి ఉన్న రోడ్డును గమనించని డ్రైవర్ మాణిక్యరెడ్డి అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో కారు అదుపుతప్పి పల్టీ కొట్టి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. సమాచారం అందిన పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి క్షతగాత్రులను జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సంక్షిప్త వార్తలు

◆ 31న ఎస్‌జీఎఫ్ క్రీడలు

కౌడిపల్లి(నర్సాపూర్): ఈనెల 31వ తేదీ నుంచి మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని కౌడిపల్లి ఉన్నత పాఠశాల పీడీ రమేశ్ తెలిపారు. అండర్ 14, అండర్ 17 విభాగాలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాపోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. 31న బాలికలకు భుజిరంపేట ఉన్నత పాఠశాల ఆవరణలో, బాలురకు సెప్టెంబర్ 4న వెల్మకన్న పాఠశాల మైదానంలో క్రీడాపోటీలు ఉంటాయని ఆయన తెలిపారు.

◆ నేడు ఉచిత వైద్యశిబిరం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని టీపీపీ చారి ఆస్పత్రిలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు టీఎస్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మినివాస్ తెలిపారు. డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ జ్యోతిష్మతి ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉచితంగా స్కానింగ్, పరీక్షలు, అవసరమైన మందులు అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

◆ ఏకాదశి పూజలు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా ఆలయాలలో శ్రావణమాసం సందర్భంగా భక్తులు పూజలు నిర్వహించారు. గురువారం స్థానిక జ్యోతిర్లింగ దేవస్థానంలో ఏకాదశిని పురస్కరించుకొని పురోహితులు రాజ్‌కుమార్ అధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, బిల్వార్చన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రభుగుప్తా తదితరులు ఉన్నారు.

◆ మండపాల ఏర్పాటులో జాగ్రత్తలు పాటించాలి

పెద్దశంకరంపేట(మెదక్): గ్రామాలలో వినాయక మండపాల ఏర్పాటులో జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ.శంకర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఉత్తులూర్‌లో ప్రజలకు మండపాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. శాంతిభద్రతలకు సహకరించాలని, డీజేలు ఏర్పాటు చేయవద్దన్నారు. మండపాలను అనుమతితో ఏర్పాటు చేసుకోవాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ నేడు చెక్కుల పంపిణీ

శివ్వంపేట(నర్సాపూర్): సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి పంపిణీ చెస్తారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్ గురువారం తెలిపారు. ఉదయం 11 గంటలకు శివ్వంపేట రైతు వేదికలో లబ్ధిదారులకు అందజేస్తారని పేర్కొన్నారు.

◆ 2 నుంచి మండల స్థాయి పోటీలు

చేగుంట(తూప్రాన్): సెప్టెంబర్ 2 నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు చేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీడీ శారద పేర్కొన్నారు. మండల వనరుల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మండల స్థాయి పోటీల వివరాలను వెల్లడించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. బాలికలకు వడియారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, బాలురకు తెలంగాణ మోడల్ పాఠశాలలో నిర్వహించనున్నారు. సమావేశంలో పీడీలు నాగరాజు, మంజులత, శంకర్‌తో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

◆ నేడు సంగాయిపేటలో బోనాలు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని సంగాయిపేటలో వెలసిన శ్రీ దుర్గా మాత ఆలయ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం జరగనున్నాయి. ఈ సందర్భంగా బోనాల ఊరేగింపు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

◆ రేషన్‌కార్డు లేకున్న రుణమాఫీ : ఏఓ

శివ్వంపేట(నర్సాపూర్): రేషన్‌కార్డులు లేకున్న రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ వర్తిస్తుందని ఏఓ లావణ్య అన్నారు. రుణమాఫీ కాని రైతులకు సంబంధించి వివరాలు సేకరించేందుకు గురువారం శివ్వంపేటలోని రైతు వేదికలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. రుణమాఫీ జరగని రైతుల వివరాలు తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేపట్టారు. ప్రస్తుతం రేషన్‌కార్డు లేని రైతులకు రుణమాఫీ నిర్ధారణ చేపట్టారు. కార్యక్రమంలో ఏఈఓ సుభాష్, తదితరులు ఉన్నారు.

◆ ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం తెలుగు భాష గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విఠల్, ఉపాధ్యాయులు రవి, అనిత, ప్రవీణ్‌కుమార్, ఆనంద్, సమీఉల్లా తదితరులు ఉన్నారు.